## అనగనగా... ఒక కథ

# పాత ఇంట్లో... కొత్త కాపురం

"అన్నూ..అన్నూ"

"ఏమిటండీ"

"రాజు ఉత్తరమోయ్"

"నాకు తెలుసు- ఇంగ్లీషులో ఉంది కదాని..మడతెట్టి కవర్లో దాచేశాను. ఇంతకీ ఏమిటంట అంత ఆనందం-తమరికి టిక్కెట్లు పంపిస్తాననీ, అమెరికా రమ్మనీ రాశాడా..మీ రాజు"

"కాదోయ్ అతనే వస్తున్నాట్ట..నెల్లాళ్లు మన దగ్గరే ఉంటాట్ట!"

"...."

"ఏమిటీ అంత సైలెంటైపోయావు"

"...."

"ఏంటి అన్నపూర్ణా..ఎందుకలా టెన్షన్‌గా వున్నావు"

"అదే..ఆలోచిస్తున్నానండీ..కుచేలుడింటికి కృష్ణుడువస్తే పాపం కుచేలుడుకి ఎంత కష్టం..అని! కూచుండ మా ఇంట కుర్చీలు లేవు..అని ఘంటసాల పద్యాలు పాడుకోవాలి. అమెరికా వాళ్లొస్తున్నారంటే మనింటిని చాలా ముస్తాబు చేయాలండీ! బూజు దులిపించి వెల్లలేయించాలి. కిటికీలకీ గుమ్మాలకి రంగులేయించాలి. ముఖ్యంగా..నీళ్ల గదీ..పాకీదొడ్డీ..కూల్చేసి శుబ్బరంగా కట్టించాలి"

"ఆ ఆఖరి మాట, నీ కోరిక! అలాగే ఇంక వాయిదా వెయ్యను-వెల్లలూ రంగులూ గురించి అంత ఆలోచించకు-ఇదేం పెళ్లివిడిది కాదు"

"స్సర్రే..మీ ఇష్టం..ఇంతకీ అతను ఎందుకొస్తున్నాట్ట"

"వచ్చాక చెప్తానూ..చాలా ముఖ్యమైన పనిమీద వస్తున్నానని రాశాడు"

"ఏవుందీ ఇక్కడి భూములూ గట్రా అమ్మేసి డబ్బట్టుకు చక్కాపోతారు. లేకపోతే ఈ పల్లెటూళ్లో అంతకన్నా ముఖ్యమైన పని ఏవుంటుంది అమెరికా వాళ్లకి"

"అవచ్చు..కావచ్చు.."

★ ★ ★

"పొలం అమ్మడానికి కాదురా నేను వచ్చిందీ- నాన్న చనిపోయాక ఆయన కోరిక ప్రకారం లాకర్ ఓపెన్ చేశాను..అందులో ఆయన రాసిన ఒక ఉత్తరం ఒక సీల్డ్ డబ్బా వుంది"

"దాంట్లో ఏవుందీ.."

"ఉత్తరం చదువు నీకే తెలుస్తుంది"

రాజూ..


రూపాయల ఆశముదిరి, డాలర్ల ధ్యాస పెరిగినప్పుడు మనస్సుకి మసకేస్తుంది..మమతానురాగాలు పల్చబడిపోతాయ్-

ఉన్న ఊరూ కన్నవాళ్లూ మోడైపోతూన్నట్లు అనిపిస్తుంది. ఆ పరువంలో పరుగు!! ఆ పరుగు కోరుకున్నది అందిస్తుందేమో కానీ..వయసుపొగరు దిగుతూన్నప్పుడు పాత మమతలు ఎదలోతుల్లో మేల్కొని దిగుల్ని కెలుకుతాయి. ఆ పరిస్థితి మొన్న మన వూరు వెళ్లినప్పుడు నాకు కలిగింది- పొలాలమధ్యలో పచ్చని ప్రహరీలో బొమ్మేసినట్లు ఠీవిగా ఉండే మా తాతయ్య కట్టించిన ఇల్లు- మా అమ్మమెట్టిన ఇల్లు-మీ అమ్మ కాపురానికొచ్చిననాటి ఇల్లు..ఇప్పుడు లేదు- కాలం కడుపులో కూరుకుపోయింది. గుమ్మాలు కిటికీలు ఎవరెవరో తవ్వుకుపోయారు. పైకప్పు ఆనవాలు లేదు-మొండి గోడలులోంచి ఒక ఇటిక గుప్పెడు మట్టీ..తెచ్చాన్రా..నువ్వెప్పుడు ఎక్కడ ఇల్లుకట్టినా ఈ రెండూ వాడాలని చెబ్దావని ఈ లేఖ! నా ఆశా- నేనూ- నా సెంటిమెంట్లూ..నీకు వెర్రితనంగా కనిపిస్తాయేమో కానీ నేను పోయేలోగా..మావూరు వెళ్లి అక్కడ ఇల్లు కడతామనే అనుకున్నాను. మృత్యువు వస్తూనే 'గుండె' తలుపుతట్టింది-

ఈ స్ట్రోక్ ఇంకోసారీ ఇంకోసారీ వస్తే డేంజరన్నారు-'విమానాలు ఎక్కకూడదు..విదేశీ ప్రయాణాలు చేయకూడదు' అని..నీతో చెప్పించారు..నాకు నవ్వొచ్చింది..'స్వదేశీ' ప్రయాణం కూడా చెయ్యకూడదా..అని-

రాజూ! పెద్దాళ్లుపోయి..మనం పెద్దాళ్లు అయ్యాక, పోయినవాళ్లమీద గౌరవం

రూపాయల ఆశముదిరి, డాలర్ల ధ్యాస పెరిగినప్పుడు మనస్సుకి మసకేస్తుంది..మమతానురాగాలు పల్చబడిపోతాయ్-ఉన్న ఊరూ కన్నవాళ్లూ మోడైపోతూన్నట్లు అనిపిస్తుంది. ఆ పరువంలో పరుగు!! ఆ పరుగు కోరుకున్నది అందిస్తుందేమో కానీ..వయసుపొగరు దిగుతూన్నప్పుడు పాత మమతలు ఎదలోతుల్లో మేల్కొని దిగుల్ని కెలుకుతాయి. ఆ పరిస్థితి మొన్న మన వూరు వెళ్లినప్పుడు నాకు కలిగింది



పెరుగుతుంది. నాకూ అలాగే అయింది..నీకూ అలాగే పెరుగుతుంది అనుకుంటా! నువ్వేం చేయాలో నేను శాసించను-నువ్వేం చేస్తావో నేనూహించను. అందుకే- నేను పోయాకే ఈ లాకర్ ఓపెన్ చేయమన్నాను.

-ఇట్లు

మీ నాన్న"

"నువ్వేం చేయదల్చుకున్నావ్..అని నిన్ను అడగక్కర్లేదు-చెప్పు ఏం చేద్దాం-నేనేం చేయాలీ"

"మాకు అక్కడో ఇల్లు కట్టించి పెట్టు-మా తాతగారి ఇల్లు ఎలా వుండేదో అలాగే"

"మాకు అంటున్నావ్ నువ్వు వుంటావా?"

"అనే..అనుకుంటున్నాను"

"మీ ఆవిడా పిల్లలూ వస్తారా"

"అనే అనుకుంటున్నాను"

"చాలా ఎమోషనల్‌గా ఫీలవుతున్నావ్...ఇలాంటి నిర్ణయాలు ఇంత త్వరగా తీసుకోకూడదు"

"త్వరగా కాదు..ఒక తరం ఆలస్యం అయింది"

"ప్లీజ్..ప్లీజ్ రాజూ..కంట్రోల్..కంట్రోల్..నీకు డబ్బుంది..మీ నాన్నగారి కోరిక తీర్చాలన్న ఆశ వుంది. ఇవ్వాళ పని మొదలెడితే మూణ్నెళ్ల తిరక్కుండా గృహప్రవేశం చేయచ్చు"

"మూణ్నెల్లు పడుతుందా?"

"మూణ్నెళ్లంటే ఎంత-నువ్వెళ్లి ఏర్పాట్లు అన్నీ చూసుకుని..వదినని పిల్లల్నీ తీసుకొచ్చేటప్పటికి మూణ్నెళ్లూ ఇట్టే గడిచిపోతాయ్"

"...."

"నువ్ లే-స్నానం చేసి తోటకెళ్లొద్దాం- ఆ పొలం ఎవరు చేస్తున్నారో ఎన్నాళ్లు కౌలుకిచ్చారో నాకు తెలీదు"

"అన్నీ క్లియర్‌గా రాసి ఉంచార్లే-ఆ ప్రోబ్లం ఏం రాదు"

* * *

అనుకున్నట్టుగా ఏ ప్రోబ్లం లేకుండా..పన్లూ ప్లాన్లూ అయిపోయాయి. శంఖుస్థాపనా అయింది! గృహప్రవేశానికి పదిహేను రోజుల ముందు వస్తానని అమెరికాకెళ్లాడు రాజు.

అనుకున్నట్టుగా భార్య అభిప్రాయం కల్సి రాలేదు.

అనునయించాడు-నచ్చ చెప్పాడు-ప్రాధేయపడ్డాడు-

ఆమె మొండికేసింది...ఏడిచింది...చనిపోయిన పెద్దాయన్ని శాపాలెట్టింది-పిల్లల ఓట్లు తనే సంపాదించుకుంది.

వాళ్లక్కావల్సినప్పుడు తనొచ్చి చూడచ్చుని..వాళ్ళకి కావాల్సినంత డబ్బు ఇచ్చి గుడ్ బై చెప్పేసాడు.

* * *

ఇది జరిగి సరిగ్గా పాతికేళ్లయింది.

ఇప్పుడు రాజు వయస్సు 65 ఏళ్లు-

భార్యాపిల్లలూ మొదట్లో లెటర్ రాసేవారు. 'రమ్మని'-

రాజూ అలాగే రాసేవాడు 'రమ్మని'-

అమెరికానుంచొచ్చి అచ్చ తెలుగు పల్లెటూరి ఇల్లుకట్టుకుని, ముచ్చట పడిపోతున్న రాజుని ఎవరూ పిచ్చాడని అనుకోలేదు-భార్యా పిల్లలు తప్ప- తన తాతల నాటి ఇంటిని పునరుద్ధరించాక ఆయన పేరుకే పేరొచ్చేలా ఎన్నో మంచిపన్లు చేసాడు ఆ ఊరికి.

ఒక రోజు అనూహ్యంగా రాజు భార్య వచ్చి తలుపు తట్టింది-పనికుర్రాడు తలుపుతీసి 'పైన కూచోండి' అని వెళ్లిపోయాడు.

ప్రహరీలోంచి నలభై అడుగులు కాలిబాటలో నడిస్తే నాలుగు తరాలనాటి వైభవానికి సాక్షీభూతంగా నిలిచిన పెద్ద పెంకుటిల్లు టేకు స్తంభాలూ-వరండా అనిపించేలా ఇల్లు చుట్టూ అరుగులు-

పచ్చటి చెట్ల మధ్యలో నూట యాభై యేళ్ల మహావృక్షంలా ఉందా ఇల్లు.

అరుగులమీద ఉన్న కుర్చీల్లో ఓ దాంట్లో కూచుంది.

గుండె గుబగబలాడుతోంది పాతికేళ్ల క్రితం చూసింది ఆయన్ని- మొండి!! ఎందుకొచ్చావ్ పొమ్మన్నా అంటారు-

'ఆయనలా అంటే...' అన్న ఆలోచన అమెరికాలో ఉండగా తనకి రాలేదు-ఆ ఆలోచన వచ్చినా ఇంక అక్కడుండలేదు తను- కొడుకులూ కోడళ్లూ ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయాక తనేంటో తెల్సింది- కాదు కొడుకులిద్దరూ కోడళ్లతో చెప్పించారు- అమెరికా అమ్మాయిలయినా చక్కటి నీతి చెప్పారు- మొగుడూ పెళ్లాల మధ్యలో ఎవరూ ఉండకూడదు- మొగుడూ పెళ్లాల మధ్యలోకి ఎవర్నీ రానీయకూడదని.

ఇంకొక్క నిముషం అక్కడుండక్కర్లేదని అర్థమయింది. తన ఫ్లాట్ కూడా అమ్మేసింది! టిక్కెట్ కొనేసుకుంది.

వెళ్లేరోజు ఇద్దరికీ ఫోన్ చేసింది-'వీలైతే..ఎయిర్‌పోర్ట్‌కి వస్తా'నన్నాడు పెద్దవాడు-రెండోవాడు 'ఆల్ ది బెస్ట్'న్నాడు-

"అయ్యగారు పూజవగానే వస్తారు-ఎవరో కార్లో వచ్చారని చెప్పాను-ఇలా తలూపారు" అని మంచినీళ్లిచ్చాడు ఇందాకా గేటు తీసిన కుర్రాడు, కంచుగ్లాసుతో. బంగారంలా మెరుస్తోంది. మెయింటెనెన్స్ బావుంది. నిజమే ఇల్లూ తోటా అన్నీ అంతే. మంచి మెయింటెనెన్స్‌తో వున్నాయి.

కొంతసేపటికి ఆయన వచ్చారు-

"ఓ....నువ్వా సారీ..నేను పూజలో వుండిపోయా"

పట్టుపంచి లుంగీలా కట్టుకున్నాడు. పైన అలాంటి క్లాతే...ఖండువా-తెల్లబడిన జుట్టూ-కనుబొమల మధ్యలో చిన్న కుంకుం బొట్టూ-మనిషి మారలేదు-కానీ ఈ గెటప్పు పెళ్లిలో చూసాను. మళ్లీ ఎప్పుడూ చూళ్లేదు. తనకేసి చూసుకుంది....అమెరికా నుంచి దిగుమతి అయినట్లు తెలుస్తోంది.

"ఒక్క పది నిముషాలు ముందే వొస్తే..నీతో మాట్లాడి పంపించేసే పూజలోకెళ్లే వాణ్ని"

'ఈయనగారు ఇంకా సాఫ్ట్‌గా అయిపోయారన్నమాట' అనుకుంది ఆవిడ... "పది నిముషాలు ముందొస్తే మీతో పూజలో కూచునేదాన్ని"

ఆమె మాటలు ఏ మూడ్‌లో ఉన్నాయో...రాజుకి వెంటనే స్ఫురించలేదు..అది ఇదివరకుట్లా పొగరుగా అందా? ఒదిగిపోయి వినయంగా అందా?? తెలియలేదు-

"ఏమన్నావ్?"

"ఏమనగలను..పెళ్లయాక మా పుట్టింటి నుంచి వచ్చి ఈ ఇంట్లో గృహప్రవేశం చేసుకున్నాను-ఇప్పుడు మళ్లీ చేస్తున్నాను. మళ్లీ సత్యనారాయణ వ్రతం ఏర్పాట్లు చెయ్యండి" అని లోపలికి వెళ్తూ... "ఏవండీ టేక్సీలో సామాన్లు తీసుకుని బిల్లు ఇచ్చి పంపెయ్యరూ" వెనక్కొచ్చి చెప్పింది.

రాజు ఆశ్చర్యం-ఆనందం, ఏ ఫీలింగూ ఆమెకి అక్కర్లేదు.

తనకి కూడా...ఆమె తీసుకున్న నిర్ణయానికి కారణం ఏంటి? అసలు అక్కడ ఏం జరిగింది- అడగాలని లేదు-అక్కర్లేదు.

ఇది మా ఇల్లు-

ఇవ్వాల్టి నుంచి మా కొత్తకాపురం అనుకున్నారు.

నిండునూరేళ్లు ఉండటానికి అబ్బో ముప్పై ఐదు ఉన్నాయి చాలనుకుంటూ.

★

